సాక్షి కామారెడ్డి
గురువారం ၊ 13 ၊ జూలై ၊ 2023



తెగని పంచాయితీ

అటవీ భూమి సాగు విషయంలో గిరిజనులు, ఫారెస్ట్ అధికారుల మధ్య పంచాయితీ తేలడం లేదు.

- 8లో ▸



మరోసారి విచారణ

తెలంగాణ యూనివర్సిటీ మెయిన్, సౌత్ క్యాంపస్‌లలో విజిలెన్స్ అధికారులు మరోసారి విచారణ జరిపారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.4 /20.6

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ఎల్లారెడ్డి డీఎస్పీ బదిలీ

సాక్షి, కామారెడ్డి: ఎల్లారెడ్డి డీఎస్పీ ఏ.శ్రీనివాసులు బదిలీ అయ్యారు. రాష్ట్ర పోలీస్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. ఆయన స్థానంలో వీఆర్‌లో ఉన్న తాల్లపల్లి సత్యనారాయణ రానున్నారు.

'మంకీ ఫుడ్ కోర్టు దున్నేశారు'

గాంధారి: మండలకేంద్ర శివారులోని మంకీ ఫుడ్ కోర్టులో పెంచిన చెట్లను కొందరు గిరిజనులు పోడు భూముల పేరుతో తొలగించి, మక్క సాగు చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సర్పంచ్ సంజీవు ఆధ్వర్యంలో గ్రామస్తులు బుధవారం మంకీ ఫుడ్ కోర్టును పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ గోవర్ధన్, అటవీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్, అటవీ శాఖ డిప్యూటీ రేంజర్ శ్రీధర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆ భూమికి సంబంధించి తమకు పట్టా పాస్ బుక్కులు ఇచ్చారని గిరిజనులు అధికారుల దృష్టికి తెచ్చారు. రికార్డులు పరిశీలించి సర్వే చేస్తామని, అంతవరకు సదరు భూమిలో పంటలు సాగు చేయరాదని అధికారులు సూచించారు.

15న ఓయూలో ధర్నా



భిక్కనూరు: రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15న ఉస్మానియా యూనివర్సిటీలో ధర్నా చేయనున్నట్టు యూనివర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకులు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ గుప్తా తెలిపారు. బుధవారం ఆయన భిక్కనూరులోని తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఓయూలో నిర్వహించే ధర్నాలో రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం ప్రతినిధులు యాలాద్రి, నర్సయ్య, రమాదేవి, సునీత, నిరంజన్, సరిత, శ్రీకాంత్, శ్రీమాత, దిలీప్ పాల్గొన్నారు.

నేటి నుంచి 'మధ్యాహ్నం' బంద్


సదాశివనగర్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం నుంచి మధ్యాహ్న భోజన పథకాన్ని నిలిపి వేస్తున్నట్లు మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకుల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ నుంచి కోడి గుడ్ల బిల్లులు, జనవరి నుంచి భోజనం బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు రూ. 4 కోట్ల వరకు బిల్లులు రావాల్సి ఉందని తెలిపారు. బిల్లులను వెంటనే చెల్లించాలని, లేకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని పేర్కొన్నారు.

'సమాజాన్ని చైతన్యం చేసే సాహిత్యం రావాలి'




కామారెడ్డి అర్బన్: కవులు, రచయితలు, కళాకారులు ప్రజల పక్షాన నిలిచి, సమాజాన్ని చైతన్యవంతం చేసే సాహిత్యం రచించాలని తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి సూచించారు. బుధవారం జిల్లాకేంద్రంలోని కర్షక్ బీఈడీ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో కొండి మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాన్ని చైతన్యం చేసే సాహిత్యం వచ్చినపుడే కవులు, రచయితలు, కళాకారులకు గుర్తింపు లభిస్తుందన్నారు. సమావేశంలో తెరవే జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్, ప్రధాన కార్యదర్శి అల్లి మోహన్‌రాజ్, ప్రతినిధులు సూరారం శంకర్, మంద పీతాంబర్, బి.నాగభూషణం, కాసర్ల రామచంద్రం, యెనిశెట్టి గంగప్రసాద్, విజయరామరాజు, చంద్రకాంత్, యెంబరి లింగం, ప్రకాష్ పాల్గొన్నారు.

సత్యాగ్రహ దీక్షలో షబ్బీర్



కామారెడ్డి టౌన్: రాహుల్ గాంధీపై అనర్హత వేటును నిరసిస్తూ ప్రధాన మంత్రి మోడీకి వ్యతిరేకంగా బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో మాజీ మంత్రి షబ్బీర్ అలీ పాల్గొన్నారు. ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు.

అంతా ఇన్‌చార్జీలే..!



సాక్షి, కామారెడ్డి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతోంది. వాటిని పర్యవేక్షించాల్సిన బాధ్యత డీఎంహెచ్‌వోపై ఉంటుంది. కాగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి పో స్టు చాలా కాలంగా ఖాళీగానే ఉంటోంది. రెగ్యులర్ అధికారి లేకపోవడంతో పాలన గాడి తప్పుతోంది. సరైన పర్యవేక్షణ లేక ప్రైవేటు ఆస్పత్రులు, లాబొరేటరీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. యథేచ్ఛగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తూ, అడ్డగోలుగా అబార్షన్లు చేస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. లక్ష్మణ్ సింగ్ ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రెగ్యులర్ అధికారి ఉంటే పరిస్థితిలో కొంత మార్పు కనిపించేదన్న భావన వ్యక్తమవుతోంది.

మహిళా శిశు సంక్షేమ శాఖలో..

కీలకమైన మహిళా, శిశు సంక్షేమ శాఖ చాలా రోజులుగా ఇన్‌చార్జి పాలన కిందే కొనసాగుతోంది. మార్కెటింగ్ శాఖ అధికారి రమ్యకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం, పిల్లలకు ప్రీ స్కూల్ బోధన అందించాల్సి ఉంటుంది. జనన మరణాల నమోదు, అనాథలకు సంబంధించి సమాచారం సేకరించి, వారికి కావలసిన సౌకర్యాలు కల్పించడం, కిషోర బాలికల వివరాలను నమోదు చేయడం వంటివన్నీ అంగన్‌వాడీల ద్వారానే జరుగుతాయి. జిల్లాలో ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,193 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో గర్భిణులు, బాలింతలు దాదాపు 15 వేల మంది, ఆరేళ్లలోపు పిల్లలు 50 వేల పైచిలుకు

పరిపాలన సౌలభ్యం కోసం జిల్లాలు, డివిజన్లు, మండలాలను పునర్విభజించిన ప్రభుత్వం.. అందుకు అనుగుణంగా అవసరమైన పోస్టుల భర్తీని మాత్రం విస్మరించింది. దీంతో జిల్లాలో చాలా శాఖలకు రెగ్యులర్ అధికారులు లేరు. చాలా మండలాల్లో తహసీల్దార్‌లు కూడా ఇన్‌చార్జీలే కొనసాగుతుండడం గమనార్హం.

- జిల్లాలో వెక్కిరిస్తున్న ఖాళీలు
- పలు మండలాల్లో తహసీల్దార్‌లూ ఇన్‌చార్జీలే..
- రెగ్యులర్ అధికారులు లేక కుంటుపడుతున్న పాలన

లబ్ధిపొందుతున్నారు.

మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలోనే వృద్ధుల సంక్షేమం కూడా ఉంటుంది. వృద్ధులకు సంబంధించిన కార్యక్రమాలను కూడా వీళ్లే చూసుకోవాలి. అలాగే బాల్య వివాహాలను నివారించడం, మైనర్లపై అత్యాచార సంఘటన లు, బాధితులకు బాసటగా నిలవడం, వారికి సఖి కేంద్రం ద్వారా సౌకర్యాలు కల్పించడం వంటి సేవలు అందించాల్సి ఉంది. మహిళా శిశు, వృద్ధుల సంక్షేమ శాఖకు రెగ్యులర్ జిల్లా అధికారి లేకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాలపై సరైన పర్యవేక్షణ కరువైంది. దీంతో చాలా చోట్ల పాలు, గుడ్లు రెగ్యులర్‌గా సరఫరా కావడం లేదు. పూర్తిస్థాయి అధికారిని కేటాయిస్తే ప్రయోజనకరంగా ఉంటుంది.

మరికొన్ని శాఖలలో..

మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి పోస్టు చాలాకాలంగా ఇన్‌చార్జీలతో నెట్టుకొస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన ప్రచా ర బాధ్యతలు నిర్వహించాల్సిన డీపీఆర్‌వో పో స్టు పరిస్థితీ ఇంతే.. గనుల శాఖకు సంబంధించి నిర్మల్‌కు చెందిన అధికారి ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. పంచాయతీరాజ్ శాఖలో కూడా డీఈ స్థాయి అధికారే ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. భూ వివాదాలకు సంబంధించి సర్వేలు నిర్వహించే సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారిగా అసిస్టెంట్ డైరెక్టర్ అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మార్క్‌ఫెడ్‌కు ఉమ్మడి జిల్లాకు ఒకటే పోస్టు ఉంది. గతంలో కలెక్టరేట్‌లో ఉన్న మార్క్‌ఫెడ్ కార్యాలయాన్ని ఖాళీ చేశారు. ట్రెజరీకి కూడా జిల్లా అధికారిగా అసిస్టెంట్ డైరెక్టర్ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తాగునీటికి సంబంధించి ఆర్‌డబ్ల్యూఎస్, వాటర్ గ్రిడ్ వంటి వాటికి రెగ్యులర్ ఈఈ లేరు. డీఈ ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి పోస్టు ఖాళీగా ఉంది.

విద్యాశాఖలో..

జిల్లా విద్యాశాఖలో కీలకమైన పోస్టులను ఇన్‌చార్జీలతోనే నెట్టుకువస్తున్నారు. విద్యా వ్యవస్థను పర్యవేక్షించడానికి కీలకమైన జిల్లా విద్యాశాఖ అధికారి పోస్టులో ఏళ్లుగా ఇన్‌చార్జీనే ఉంటున్నారు. ఎంఈవో పోస్టులదీ ఇదే పరిస్థితి. రెగ్యులర్ డీఈవో ఉంటే పర్యవేక్షణ సవ్యంగా నడుస్తుంది. రెగ్యులర్ అధికారి లేకపోవడంతో అసిస్టెంట్ డైరెక్టర్ హోదాలో ఉన్న రాజుకు ఇన్‌చార్జీ డీఈవో బాధ్యతలు అప్పగించారు. ఆయన సమావేశాలు, సమీక్షలకే సరిపోతున్నారు. సూక్ష్మ పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదు. కొందరు ఉపాధ్యాయులు విధులకు దుమ్మా కొడుతూ సొంత పనుల్లో బిజీగా తిరుగుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. దీంతో జిల్లాలో విద్యావ్యవస్థ దెబ్బతింటోందని పలువురు విద్యాభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలాల్లో పరిస్థితి..

మండల స్థాయిలో కీలకమైనది రెవెన్యూ విభాగం. మెజిస్టీరియల్ బాధ్యతలు ఉండే తహసీల్దార్ పోస్టులు చాలా మండలాల్లో ఇన్‌చార్జీలతో నడుస్తున్నాయి. జిల్లాలోని బిచ్కుంద, మద్నూర్, నస్రుల్లాబాద్, డోంగ్లీ, పాల్వంచ, తాడ్వాయి, రాజంపేట, లింగంపేట తదితర మండలాల్లో రెగ్యులర్ తహసీల్దార్‌లు లేరు. ధరణి పోర్టల్ ద్వారా భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ అంతా తహసీల్దార్ల పరిధిలోనే కొనసాగుతుంది. రెగ్యులర్ అధికారులు లేకపోవడం ఇబ్బందికరంగా మారింది. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో పనుల ఒత్తిడి పెరుగుతుంది. ఇప్పటికే సిబ్బంది కొరతతో పనుల్లో జాప్యం జరుగుతోంది. ఎన్నికల సమయంలో పని భారం మరింత పెరగనుంది. ఖాళీలను భర్తీ చేస్తేనే ప్రజలకు మెరుగైన సేవలందే అవకాశాలున్నాయి.

'విద్యాసంస్థల బంద్ విజయవంతం'



దేవునిపల్లి ప్రభుత్వ పాఠశాలలో నినాదాలు చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కామారెడ్డి టౌన్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలన్న డిమాండ్‌తో బుధవారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని వామపక్షాల విద్యార్థి సంఘాల ప్రతినిధులు తెలిపారు. బుధవారం జిల్లాలో తెరిచి ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలను బంద్ చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధుల పిల్లలను ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివించేలా కామన్ స్కూల్ విద్యా విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు అరుణ్‌కుమార్, సురేష్, బీవీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ శివప్రసాద్, టీడీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నరేందర్, నాయకులు సురేష్, అనిల్, ముఖేష్, శ్రీకాంత్, అర్జాజ్, పెరుమాండ్ల బుల్లెట్ పాల్గొన్నారు.

'గ్రూప్-2కు 23 పరీక్ష కేంద్రాలు'

కామారెడ్డి టౌన్: జిల్లాలో గ్రూప్ -2 పరీక్ష కోసం 23 కేంద్రాలను ఏర్పాటు చేశామని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ తెలిపారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌నుంచి జూమ్ యాప్ ద్వారా టీఎస్పీఎస్సీ అధికారులతో మాట్లాడారు. వచ్చేనెల 29, 30 తేదీల్లో నిర్వహించే గ్రూప్-2కు జిల్లాలో పరీక్ష రాయడానికి 8,881 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. పరీక్ష కేంద్రాలలో ఏర్పాట్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఈవో ఎస్.రాజు, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం, కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

'ఓటర్ల నమోదుకు సహకరించాలి'



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి టౌన్: జిల్లాలో అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేసే కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో రెండో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం, ఓటరు జాబితా తయారీ, ఓటరు నమోదు పురోగతి తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వచ్చేనెల 26, 27 తేదీలతోపాటు సెప్టెంబర్ 3 న ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆగస్టు 21న డ్రాఫ్ట్ ఓటరు జాబితా, అక్టోబర్ 4న ఓటరు జాబితా విడుదల చేస్తామన్నారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నిరసనల్లో పోటాపోటీ





జిల్లా కేంద్రంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ తగలబెడుతున్న బీఆర్ఎస్ నాయకులు, కామారెడ్డిలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

- రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ శ్రేణుల ఆగ్రహం
- సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసిన కాంగ్రెస్
- జిల్లావ్యాప్తంగా కొనసాగిన రెండు పార్టీల ఆందోళనలు

సాక్షి, కామారెడ్డి: ఉచిత విద్యుత్ విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల మధ్య చెలరేగిన మాటల మంటలు నిరసనలతో కొనసాగాయి. బుధవారం ఇరు పార్టీలు పోటాపోటీగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాయి. జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ ఆధ్వర్యంలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిరిసిల్ల రోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద కాంగ్రెస్ శ్రేణులు నిరసన తెలిపాయి. అనంతరం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను తగలబెట్టారు. పిట్లంలో బీఆర్ఎస్ ఆందోళనలో జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే పాల్గొన్నారు. పిట్లంలో కాంగ్రెస్ నాయకుడు లక్ష్మీకాంతరావు ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. పెద్దకొడప్‌గల్‌లో మాజీ ఎమ్మెల్యే గంగారాం ఆధ్వర్యంలో నిరసన చేపట్టి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎల్లారెడ్డిలో మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ నేతలు కేసీఆర్ దిష్టిబొమ్మను తగలబెట్టారు. బాన్సువాడలో బీఆర్ఎస్ నేత సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ప్రతిగా కాంగ్రెస్ నేతలూ నిరసన కార్యక్రమం చేపట్టారు. భిక్కనూరులో చాలాసేపు ధర్నా కొనసాగడంతో ఆందోళన విరమించాలని కోరిన ఎస్సైతో కాంగ్రెస్ నేతలు వాగ్వాదానికి దిగారు. సదాశివనగర్, మద్నూర్, బిచ్కుంద, లింగంపేట, మాచారెడ్డి, దోమకొండ, బీబీపేట, భిక్కనూరు, రామారెడ్డి, గాంధారి, నాగిరెడ్డిపేట తదితర మండలాల్లో ఆందోళనలు కొనసాగాయి.

రైతులే బుద్ధి చెబుతారు

కామారెడ్డి టౌన్: ఉచిత విద్యుత్‌పై తప్పుడు వ్యాఖ్యలు చేసిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్‌కు రైతులే బుద్ధి చెబుతారని ఉర్దూ అకాడమీ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. అనంతరం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా రద్దు చేస్తుందని ఆరోపించారు. చంద్రబాబు నాయుడుకు తొత్తుగా వ్యవహరిస్తూ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నాడని రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పిప్పిరి వెంకటి, పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నిట్టు వేణుగోపాల్‌రావు, గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, గెరిగంటి లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

చిల్లర రాజకీయాలు..

కామారెడ్డి టౌన్: కాంగ్రెస్ ఎదుగుదలను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ చిల్లర రాజకీయాలకు పాల్పడుతోందని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు విమర్శించారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరించడాన్ని నిరసిస్తూ బుధవారం జిల్లా కేంద్రంలోని సిరిసిల్లరోడ్‌లో గల విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కైలాస్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ రైతులకు ఉచితంగా ఎరువులు ఇస్తామని, రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి మోసం చేసింది బీఆర్ఎస్సేనని పేర్కొన్నారు. రైతులు, పేదలకు ఆదుకునేది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు పండ్ల రాజు, గూడెం శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్, సందీప్, పాక జ్ఞానేశ్వరి, శివ కృష్ణమూర్తి, లక్ష్మణ్, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'బీసీల ప్లీనరీకి తరలిరావాలి'



బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్‌తో జిల్లా నాయకులు

కామారెడ్డి అర్బన్: హైదరాబాద్‌లో ఈనెల 15న నిర్వహించే బీసీల రాజకీయ ప్లీనరీకి తరలిరావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం కామారెడ్డి ఆర్అండ్‌బీ అతిథి గృహంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలు వచ్చిన ప్రతిసారి రాజకీయ పార్టీలు డిక్లరేషన్ల పేరుతో బీసీలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. చట్టసభల్లో బీసీల జనాభాకు అనుగుణంగా సీట్ల సంఖ్య పెరిగినపుడే అన్ని రంగాల్లో న్యాయం జరుగుతుందన్నారు. ఎన్నికలలో బీసీలను గెలిపించుకోవాలని సూచించారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు, ప్రధాన కార్యదర్శి పి.మహేష్‌కుమార్, నాయకులు మోహనాచారి, నారాయణరావు, విఠల్, కేశవ్, నరేష్, ప్రవీణ్‌కుమార్, సురేష్‌కుమార్, మేదరి లక్ష్మణ్, దయాకర్, మాయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కళాశాలను మంజూరు చేయాలి



బీబీపేట: బీబీపేటకు జూనియర్ కళాశాలను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నాయకులు బుధవారం గంటపాటు ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి మూడేళ్లయినా మంజూరు చేయలేదని ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేష్, భూమాగౌడ్, పాత రాజు, చందు, స్వామి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఒకరు డిబార్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బుధవారం జరిగిన డిగ్రీ 6వ సెమిస్టర్ పరీక్షల్లో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ ఒక విద్యార్థి డిబార్ అయినట్లు కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం అరుణ తెలిపారు. ఉదయం జరిగిన డిగ్రీ 6వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షకు 8,259 మంది విద్యార్థులకు గానూ 7,600 మంది హాజరు కాగా 659 మంది గైర్హాజరయ్యారని కంట్రోలర్ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన డిగ్రీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షకు 5,023 మంది విద్యార్థులకు గానూ 4,363 మంది హాజరు కాగా 660 మంది గైరాజరయ్యారని కంట్రోలర్ తెలిపారు. నిజామాబాద్‌లోని నిశిత డిగ్రీ కాలేజ్ పరీక్ష కేంద్రంలో ఒక విద్యార్థి డిబార్‌కు గురైనట్లు తెలిపారు.

బిచ్కుంద వాసికి డాక్టరేట్



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ లెక్చరర్ పనిచేస్తున్న కొడగంటి అశోక్ డాక్టరేట్ అందుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో జంతుశాస్త్ర సీనియర్ ప్రొఫెసర్ పర్యవేక్షణలో 'ఇన్‌సెక్ట్ పేస్ట్ సోయాబీన్' అంశం పై ఆయన రిసెర్చ్ పూర్తి చేశారు. దీంతో యూనివర్శిటీ అశోక్ కు డాక్టరేట్ అందించి సన్మానించారు. బిచ్కుంద కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ చంద్రముఖర్జీ ఆయనను అభినందించి, సన్మానించారు.

కుక్కల దాడిలో జింకకు గాయాలు



మద్నూర్: మండలంలోని లింబూర్ శివారులో బుధవారం కుక్కల దాడిలో కృష్ణజింక తీవ్రంగా గాయపడింది. వెంటనే గ్రామస్తులు జింకను కాపాడి అటవీశాఖ అధికారులకు అప్పగించారు. గ్రామ శివారులో కుక్కల గుంపు కృష్ణజింకపై దాడి చేయగా, అక్కడే ఉన్న రైతులు వెంటనే స్పందించి కుక్కలను చెదరగొట్టి జింకను కాపాడారు. తీవ్ర గాయాలైన జింకకు సపర్యలు చేసి అటవీశాఖ అధికారులు రాగానే వారికి అప్పగించారు.

తెగని భూ పంచాయితీ!

- మాచారెడ్డి మండలంలో యాభై ఏళ్లుగా అటవీ భూమిని సాగుచేస్తున్న రైతులు
- పట్టాబుక్కులు లేకపోవడంతో అధికారుల వేధింపులు
- సమస్యను పరిష్కరించాలని వేడుకోలు



మద్రితండాలో గిరిజన రైతులు సాగు చేస్తున్న భూమి

మాచారెడ్డి: మాచారెడ్డి మండలంలో యాభై ఏళ్లుగా అటవీ భూములను సాగుచేసుకుంటున్న నిరుపేద రైతులకు ఇప్పటికీ పట్టాబుక్కులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. భూములు అటవీశాఖకు చెందినవంటూ శాఖ అధికారులు పలుమార్లు దాడులు చేస్తూ, కేసులు నమోదు చేస్తున్నారు. అలాగే రెవెన్యూ అధికారులు భూమి ప్రభుత్వ గెజిట్లో లేదని, పట్టా బుక్కులు ఇవ్వడం లేదు. దీంతో అధికారుల మధ్య నిరుపేద రైతులు అవస్థలు పడుతున్నారు.

వైఎస్సార్ హయాంలో పట్టాలిచ్చినా..

మాచారెడ్డి మండలంలోని అక్కాపూర్, సోమారంపేట, బంజపల్లి, తడ్కపల్లి, కొత్త గూడెం, మద్రితండా, సిక్కులోని లొద్దితండా, మైసమ్మ చెరువు, నెమలి గుట్ట తండాకు చెందిన దాదాపు రెండు వందల మంది రైతులు సుమారు యాభై ఏళ్లుగా వేయి ఎకరాల్లో సాగుచేస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి స్వర్గీయ వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో ఆయా తండాల రైతులకు పట్టాలు అందజేశారు. కానీ అది అటవీ భూమి అంటూ అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. తాజాగా మండలంలోని మద్రితండాలో ఈ నెల 2న గిరిపుత్రులు కబ్జాలో ఉన్న నేలను ట్రాక్టర్లతో దున్నుతుండగా అధికారులు అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అటవీ భూమిని ఆక్రమించుకోవడమే కాకుండా అధికారుల విధులకు ఆటంకం కలిగించారని 16 మంది రైతులపై ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయించారు. తాము సాగు చేస్తున్న భూమి ప్రభుత్వ గెజిట్లో లేదని రెవెన్యూ అధికారులు కొట్టి పారేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ నుంచి కలెక్టర్ వరకు విన్నవించినా ఫలితం లేదని రైతులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఏళ్లుగా భూములను సాగు చేసుకుంటున్న తమకు పట్టాదారు పాసుపుస్తకాలు అందించాలని రైతులు కోరుతున్నారు.

పట్టా పుస్తకాలు ఇవ్వాలి..



తాము ఎన్నో ఏళ్లుగా సాగు చేస్తున్న భూమికి పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలి. అందరి లెక్క రైతుబంధు, బీమా ఇవ్వాలి. మేము పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేయాలి.

–రాజలింగం, రైతు అక్కాపూర్

రైతుల పక్షాన పోరాడతాం..



గత 50ఏళ్లుగా కబ్జాలో ఉంటూ సాగు చేస్తున్న ఆయా గ్రామాల రైతులకు పట్టాలు ఇచ్చేంత వరకు వారి పక్షాన పోరాడుతాం. కబ్జాలో ఉన్న ప్రతి ఒక్కరికి పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేయాలి.

–సూర నర్సన్న, జిల్లా అధ్యక్షుడు, ఆల్ ఇండియా రైతుకూలీ సంఘం

మరోసారి విచారణ

- తెలంగాణ యూనివర్సిటీలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు
- మాజీ రిజిస్ట్రార్లతో పాటు 8 మందిని ప్రశ్నించిన అధికారులు



తెయూ మాజీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌ను విచారిస్తున్న అధికారులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో బుధవారం మరోసారి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విచారణ జరిపారు. తెయూ పరిపాలనా భవనంలోని ఎగ్జిక్యూటివ్ హాల్‌లో ఉదయం 11.30 గంటలకు క్యాంపస్‌కు చేరుకున్న అధికారులు సాయంత్రం 5.30 గంటల వరకు ఇద్దరు మాజీ రిజిస్ట్రార్లతో పాటు మరో 8 మందిని సుదీర్ఘంగా విచారించారు. ప్రస్తుతం ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడి జైల్లో ఉన్న వీసీ డి.రవీందర్ గుప్తా చేసిన అవినీతి, అక్రమాలు, అనుమతి లేకుండా అక్రమ పదోన్నతులు, నియామకాలు, విచ్చలవిడి కొనుగోళ్లు, చెల్లింపులు, నిధుల దుర్వినియోగం వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వ ఆదేశాల మేరకు మొదటిసారిగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గత జూన్ 6న దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో పలు రికార్డులు, సీపీయూలు, హార్డ్‌డిస్కులను అధికారులు తమ వెంట తీసుకెళ్లారు. వారం రోజుల అనంతరం జూన్ 13న రెండోసారి క్యాంపస్‌కు వచ్చిన విజిలెన్స్ అధికారులు మరికొన్ని రికార్డులను తమ వెంట తీసుకెళ్లారు. మధ్యలో ఒకసారి భిక్కనూరు సౌత్‌క్యాంపస్‌ను సందర్శించి అక్కడ కూడా కొన్ని రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. రికార్డులను, హార్డ్‌డిస్కులను సుమారు నెలపాటు క్షుణ్ణంగా పరిశీలించిన విజిలెన్స్ అధికారులు సంబంధిత వర్సిటీ అధికారులు, సిబ్బందిని విచారణ చేసేందుకు బుధవారం మరోసారి తెయూకు వచ్చారు. తాము విచారణ జరపబోయే వారిని అందుబాటులో ఉండేలా చూడాలని మంగళవారం సాయంత్రమే రిజిస్ట్రార్ ఎం.యాదగిరికి విజిలెన్స్ అధికారులు సమాచారం అందజేశారు.

మాజీ రిజిస్ట్రార్లతో పాటు..

తెయూ వీసీ రవీందర్‌గుప్తా అక్రమాలకు సహకరించారని ఆరోపణలు ఉన్న మాజీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్లు కనకయ్య, విద్యావర్ధినితో పాటు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎం.అరుణ, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు సాయాగౌడ్, విజయలక్ష్మి, సూపరింటెండెంట్ భాస్కర్(అకౌంట్ సెక్షన్), అసిస్టెంట్ ఇంజినీర్ వినోద్, సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ కవిత తోరణ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ శాంతాబాయిలను విజిలెన్స్ అధికారులు విచారణ జరిపారు. ముఖ్యంగా ప్రభుత్వం, పాలకమండలి అనుమతి లేకుండా అక్రమ పదోన్నతులు, నియామకాలు ఎలా చేపట్టారని, టెండర్లు పిలవకుండా కోట్ల రూపాయల కొనుగోళ్లు ఎలా చేశారని మాజీ రిజిస్ట్రార్‌లను ప్రశ్నించినట్లు సమాచారం. నిధుల దుర్వినియోగం, జరిగిన అవకతవకలపై ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలిసింది. పరీక్షల విభాగంలో ఇష్టారాజ్యంగా నిధులు ఖర్చు చేయడంపై కంట్రోలర్ అరుణను ప్రశ్నించినట్లు సమాచారం. అసలు నిధుల వినియోగంపై ప్రొసీజర్ ఏంటీ, ఎలా ఫాలో అవుతారని అడిగి తెలుసుకున్నారు. వీసీ, రిజిస్ట్రార్ నోట్‌షీట్‌లను ప్రకారం తాము పనిచేశామని వారు చెప్పగా విజిలెన్స్ అధికారులు ప్రతి ఒక్కరి స్టేట్‌మెంట్‌ను విడివిడిగా నమోదు చేసుకున్నారు. విజిలెన్స్ డీఎస్పీతో పాటు ముగ్గురు అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు సుదీర్ఘంగా విచారణ జరిపారు.

సౌత్‌క్యాంపస్‌లోనూ..

భిక్కనూరు: భిక్కనూరు సౌత్‌క్యాంపస్ లోనూ అధికారులు సుమారు మూడు గంటల పాటు తనిఖీలు నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు రికార్డులను పరిశీలించారు. వీసీ రవీందర్‌గుప్తా, రిజిస్ట్రార్ విద్యావర్ధిని హయాంలో హాస్టల్స్ కోసం కొనుగోలు చేసిన వస్తువులను పరిశీలించారు. వివిధ డిపార్టుమెంట్లలో తనిఖీలు చేశారు. ప్రిన్సిపాల్ కవితా తోరన్ నుంచి వివరాలు తెలుసుకున్నారు.

అవిశ్వాసంపై 2న బలనిరూపణ

నాగిరెడ్డిపేట: వైస్ ఎంపీపీ దివిటీ రాజ్‌దాస్‌పై అవిశ్వాసానికి పలువురు ఎంపీటీసీ సభ్యులు ఇచ్చిన నోటీసుపై ఆగస్టు 2న ఉదయం 11 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బలనిరూపణ కోసం అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు వైస్ ఎంపీపీ రాజ్‌దాస్‌తో పాటు 8 మంది ఎంపీటీసీ సభ్యులకు అధికారులు నోటీసు అందజేశారు.

ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి



మాచారెడ్డిలో కళాశాలను బంద్ చేయిస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

మాచారెడ్డి/రామారెడ్డి /సదాశివనగర్ /భిక్కనూరు: కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు ముఖేష్ డిమాండ్ చేశారు. బుధవారం మాచారెడ్డిలో విద్యా సంస్థలను బంద్ చేయించిన అనంతరం ఆయన మాట్లాడారు. విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. భిక్కనూరులో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలను విద్యార్థి సంఘం నాయకులు బంద్ చేయించారు.

షిర్డీ రైలులో మహిళా దొంగలు

- కొంతమంది బ్యాగులు, మహిళ బంగారు చైన్ మాయం
- తొమ్మిది మంది యువతులను పట్టించిన ప్రయాణికులు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ మీదుగా తిరుపతి నుంచి షిర్డీ వెళ్తున్న సాయినగర్ షిర్డీ రైలులో దొంగతనానికి పాల్పడిన తొమ్మిది మంది యువతులను ప్రయాణికులు పట్టుకుని రైల్వే పోలీసులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 2 గంటల నుంచి 3 గంటల మధ్య ఈ ఘటన జరిగింది. రైలు నిజామాబాద్ రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరిన తర్వాత నవీపేట్ స్టేషన్ వద్ద క్రాసింగ్ ఉండటంతో అక్కడ ఆగిపోయింది. దీంతో మహారాష్ట్రలోని బీడ్ జిల్లాకు చెందిన తొమ్మిది మంది యువతులు రైలులో ఎక్కారు. యువతులు ఎస్1 నుంచి ఎస్10 బోగీలలో అటుఇటూ తిరిగినట్లు ప్రయాణికులు తెలిపారు. మొదట ఓ బోగీలో ప్రయాణికుడి బ్యాగ్ కనబడకపోవడంతో ఆందోళనకు గురయ్యాడు. అప్రమత్తమైన ఆ కోచ్‌లో ని మిగతా వారు తమ బ్యాగ్‌లను చెక్ చేసుకోగా మరో ఆరుగురికి చెందిన బ్యాగులు కూడా కనిపించలేదు. దీంతో బోగీలో కలకలం రేగింది. కొందరు ప్రయాణికులు బాసర వద్ద ట్రైన్ చైన్ లాగడంతో ఆగిపోయింది. ఈ క్రమంలో కొందరు యువతులు బ్యాగులతో పరుగెత్తడంతో ప్రయాణికులు పట్టుకున్నారు. బాసర పోలీసులకు సమాచారం అందించి, మొత్తం తొమ్మిది మందిని అప్పగించారు. ఆర్‌ఎస్‌ఎఫ్, బాసర పోలీసులు అక్కడి నుంచి యువతులను నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

రైల్వే పోలీసుల విచారణ..

రంగస్వామి అనే ప్రయాణికుడికి చెందిన బ్యాగ్‌తో పాటు ల్యాప్‌టాప్, కొంత నగదు, ఓ మహిళ మెడలోని బంగారు చైన్ పోయినట్లు తెలిసింది. పావని, ధనుంజయ్, షేక్ నజీర్ బాషా, లీలావతి, సుబ్బారాయుడు, శ్రీనివాస్ అనే ప్రయాణికుల బ్యాగ్‌లు పోయాయి. మూడు బ్యాగ్‌లను పోలీసులు రైల్వే పట్టాల పక్కన గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కొన్ని బ్యాగులను యువతులు బాత్‌రూమ్‌లలో పెట్టినట్లు తెలిసింది. అదుపులోకి తీసుకున్న తొమ్మిది మంది యువతులను రైల్వే పోలీసులు విచారిస్తున్నారు. యువతులు నాందేడ్‌లోని గురుద్వార్‌కు వెళ్లి అక్కడ నుంచి నిజామాబాద్ నగరానికి వచ్చినట్లు తెలిసింది.

పూణె ల్యాబ్ అధ్యయనానికి జిల్లా సైన్స్ అధికారి



పూణెలోని ల్యాబ్‌లో పరిశీలన చేస్తున్న జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి

కామారెడ్డి టౌన్: మహారాష్ట్రలోని పూణెలోగల ఫ్యాబ్ ల్యాబ్ అధ్యయన పరిశీలనకు జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి ఇటీవల వెళ్లారు. రాష్ట్రంలోని విద్యార్థులకు అధునాతన సాంకేతిక ప్రయోగాల మీద ఆసక్తి పెంపొందించడానికి, పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా రాష్ట్రం నుంచి నాలుగు జిల్లాల సైన్స్ అధికారులు విజ్ఞాన అధ్యయనానికి పంపినట్లు వారు తెలిపారు. నిపుణుల అభిప్రాయాలు, అటల్ టింకరింగ్ ల్యాబ్‌లోని విశేషాలను అధ్యయనం చేయడానికి వెళ్లినట్లు తెలిపారు. ఈనెల 10నుంచి 13వరకు అక్కడే ఉండి పరిశీలన చేస్తామన్నారు. తెలంగాణలోని 379 అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను మరింత ఆకర్షణీయంగా, శక్తివంతం చేసి వినియోగం ద్వారా విద్యార్థులకు అందించేందుకు ఈ అధ్యయనం దోహదపడిందని తెలిపారు.

ఢిల్లీ ఐఐటీకి గురుకుల విద్యార్థిని



శిల్ప

బాన్సువాడ రూరల్: మండలంలోని కొయ్యగుట్టలో సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన విశిల్ప అనే విద్యార్థిని ఢిల్లీలోని ఐఐటీలో సీటు సాధించినట్లు ప్రిన్సిపల్ శోభారాణి బుధవారం తెలిపారు. గాంధారి మండలం పెద్దగుజ్జుల్ తండాకు చెందిన శిల్ప ఐఐటీలో 1467వ ర్యాంకు సాధించిందన్నారు. దీంతో ఆమెకు ప్రొడక్షన్ అండ్ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ విభాగంలో సీటు లభించిందన్నారు. శిల్పను ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రేమ్‌లాల్ జిల్లా అధ్యక్షుడు

నిజామాబాద్‌నాగారం: నగరంలోని హరిచరణ్ మార్వాడి పాఠశాలలో బుధవారం తెలంగాణ రచయితల వేదిక(తెరవే) జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని వేదిక సభ్యులు ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా పంచరెడ్డి లక్ష్మన్, గౌరవ సలహాదారులుగా పబ్బా మురళి, జిల్లా అధ్యక్షుడిగా బి ప్రేమ్‌లాల్, ప్రధాన కార్యదర్శి వేముల శేఖర్, జిల్లా ఉపాధ్యక్షులుగా అన్నల్‌దాస్ కరుణాకర్, కానుగంటి ప్రకాష్, కార్యదర్శులుగా బోర్చర్‌కార్ చంద్రశేఖర్, ఎస్ లక్ష్మన్, బి గంగాధర్, జిల్లా నుంచి రాష్ట్ర కార్యదర్శిగా ధర్పల్లి సాయికుమార్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా తెరవే రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూరారం శంకర్, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు గఫూర్ శిక్షక్ వ్యవహరించారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులతో రాష్ట్ర అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు.

'ట్రాక్టర్' ఐడియా అదిరింది



సదాశివనగర్(ఎల్లారెడ్డి): బీటీ రోడ్లపై కేజీవీల్స్ ట్రాక్టర్లను తిప్పకూడదని, ఒక వేళ రోడ్డుపై తిప్పితే బాధ్యులపై కేసులు నమోదు చేస్తామని పోలీసులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో సదాశివనగర్‌లో ఓ రైతు తన ట్రాక్టర్ ఇంజిన్‌కు బిగించిన కేజీవీల్స్‌ను రోడ్డు దెబ్బతినకుండా పొలం వద్దకు తీసుకెళ్లడానికి వినూత్నంగా ఆలోచించాడు. కేజీవీల్ ట్రాక్టర్‌ను మరో ట్రాక్టర్ ఇంజిన్‌కు కట్టి పొలం వద్దకు తీసుకెళ్లాడు. ఈ దృశ్యం బుధవారం సాక్షి కెమెరాకు చిక్కింది.

క్రైం కార్నర్

భార్య, కొడుకు మృతికి కారణమైన వ్యక్తికి ఏడేళ్ల జైలు

లింగంపేట/కామారెడ్డిటౌన్: భార్య, కొడుకు మృతికి కారణమైన ఓ వ్యక్తికి కామారెడ్డి సెషన్ కోర్టు జడ్జి శ్రీదేవి ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించినట్లు ఎస్సై శంకర్ బుధవారం తెలిపారు. వివరాలు ఇలా.. లింగంపేట మండలం మెంగారం గ్రామానికి చెందిన కొండ విఠల్ పెద్ద కూతురు ఆమనికి, బాన్సువాడ మండలం హన్మాజీపేట గ్రామానికి చెందిన జొన్నల పోచయ్యకు 2013లో వివాహం జరిగింది. 6 నెలలు గడిచిన తర్వాత పోచయ్య కట్నం కింద ఇవ్వాల్సిన బైక్ కోసం భార్యను శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. బైక్ కొనిచ్చినా కూడా ఆమెపై తరచూ వేధింపులకు పాల్పడేవాడు. ఈ క్రమంలో ఆమని జీవితంపై విరక్తి చెంది 2015 అక్టోబర్ 8న తనపై, కొడుకు రోహిత్‌పై కిరోసిన్ పోసి ఆత్మహత్యకు యత్నించింది. తీవ్ర గాయాలైన వీరిని హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో నిందితుడు పోచయ్యకు కోర్టు ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షను ఖరారు చేసింది. నిందితుడిని నిజామాబాద్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

లారీ డ్రైవర్‌కు రెండేళ్ల జైలు

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో ఐదేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో లారీ డ్రైవర్‌కు రెండేళ్ల సాధారణ జైలుశిక్షను జడ్జి విధించారు. ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపిన వివరాలు ఇలా... కమ్మర్‌పల్లిలోని గాంధీనగర్‌కు చెందిన అల్లం దుర్గయ్య 2018 అక్టోబర్ 22న తన బైక్‌పై కిరాణా షాపుకు వెళ్తుండగా, మార్గమధ్యలో లారీ ఢీకొట్టింది. దీంతో దుర్గయ్య తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన పంజాబ్ రాష్ట్రంలోని పఠాన్‌కోర్ జిల్లా భామ్‌లడా గ్రామానికి చెందిన టాకూర్ రాకేష్‌కుమార్‌పై అప్పటి ఎస్సై మురళి కేసు నమోదు చేశారు. ఆర్మూర్ కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేయగా, సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి వేముల దీప్తి బుధవారం నిందితుడికి రెండు సంవత్సరాల సాధారణ జైలుశిక్ష, రూ. 5వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో మూడు నెలల సాధారణ జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో రెండు రోజులు

కామారెడ్డి క్రైం: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో ఒకరికి కామారెడ్డి కోర్టు రెండు రోజుల జైలు శిక్ష విధించింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. దేవునిపల్లి పోలీసులు రెండు రోజుల క్రితం పట్టణంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈక్రమంలో రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామానికి చెందిన రాజయ్య డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. దీంతో బుధవారం అతడిని కోర్టులో హాజరుపరిచారు. కామారెడ్డి కోర్టు ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ నిందితుడికి రెండు రోజుల జైలు శిక్ష , రూ.200 జరిమానా విధించినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

రోడ్డుపై నడిపిన కేజ్‌వీల్ ట్రాక్టర్ సీజ్



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని మాచాపూర్ గ్రామంలో కేజీవీల్ ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై గణేష్ బుధవారం తెలిపారు. రోడ్డుపై కేజీవీల్ ట్రాక్టర్ నడుపుతున్నారని గ్రామస్తులు సమాచారం అందించడంతో గ్రామానికి వెళ్లి సదరు కేజీవీల్ ట్రాక్టర్‌ను సీజ్ చేసి, డ్రైవర్ నవీన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. రోడ్డుపై కేజీవీల్స్‌తో ట్రాక్టర్లను నడిపితే, రోడ్లు దెబ్బతింటాయని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ట్రాక్టర్ యజమానులు సహకరించాలని అన్నారు.

హెడ్ పోస్టాఫీస్‌లో ఆధార్ సేవల పునరుద్ధరణ

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ హెడ్ పోస్టాఫీస్‌లో ఆధార్ సేవలు పునరుద్ధరించబడినట్లు హెడ్ పోస్ట్‌మాస్టర్ గోలి గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ హెడ్ పోస్టాఫీస్ పరిధిలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. కొత్త ఆధార్ నమోదు, ఆధార్‌లో సవరణలకు, మొబైల్ నంబరు జత చేయటం, 5ఏళ్ల లోపు పిల్లలకు ఉచితంగా ఆధార్ నమోదు వంటి సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



సాక్షి, నెట్‌వర్క్: ఉద్యోగ భద్రత కల్పించాలనే తదితర డిమాండ్లతో పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం నాటికి ఏడవ రోజుకు చేరుకుంది. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు పలు మండలాల్లో కార్మికులు అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలియజేశారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామని కార్మికులు వెల్లడించారు.

ఆలయాల్లో దొంగల బీభత్సం

- ఆభరణాలు, నగదు, గుడి గంటలు చోరీ



సీసీ టీవీలో నమోదైన దుండగుల దృశ్యాలు

డిచ్‌పల్లి: మండలంలోని మిట్టపల్లి, రాంపూర్ గ్రామాలలోగల ఆలయాల్లో గుర్తు తెలియని దుండగులు బీభత్సం సృష్టించారు. ఆయా ఆలయాల్లోని ఆభరణాలు, నగదును, గుడి గంటను చోరీ చేశారు. వివరాలు ఇలా.. మిట్టపల్లిలో రేణుకమాత ఆలయంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ప్రవేశించి ఎల్లమ్మ విగ్రహంపై ఉన్న తాళిబొట్లు, హుండీలోని సుమారు రూ.30వేల నగదు చోరీ చేశారు. అలాగే సమీపంలోని మురళీకృష్ణ మందిరంలో రూ.లక్షన్నర నగదు, రూ.30వేల విలువగల గంటలు, ఇతర సామగ్రి ఎత్తుకెళ్లారు. అనంతరం రాంపూర్‌లోని రేణుకమాత ఎల్లమ్మ ఆలయంలో రూ. 50వేల విలువగల నగలు, గుడి గంటలు, ఇత్తడి సామగ్రి చోరీ చేశారు. హుండీలను ఎత్తుకెళ్లి సమీపంలోని పొలాల్లో వాటిని ధ్వంసం నగదులను అపహరించారు. మిట్టపల్లి ఆలయంలో చోరీ దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదయ్యాయి. ఇద్దరు దుండగులు ముఖానికి మాస్కులు ధరించి చోరీకి పాల్పడ్డారు. ఆయా గ్రామాల సర్పంచులు, వీడీసీ సభ్యుల ఫిర్యాదు మేరకు డిచ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మండలంలో వరుస చోరీలు జరగడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. పోలీసులు పెట్రోలింగ్‌ను ముమ్మరం చేసి దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.